క్లుప్తంగా

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత



వైఎస్సార్ బీమా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న నాయకులు

ఉంగుటూరు: నారాయణపురం గ్రామంలో వైఎస్సార్ బీమాలో మంజూరైన రూ.లక్ష చెక్కును వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు బాధిత కుటుంబాలకు అందజేశారు. భీమడోలు ఏసురత్నం చనిపోవడంతో అతని భార్య లక్ష్మికి, షేక్ మస్తాన్ చనిపోవడంతో అతని భార్యకు ఈ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బండారు నాగరాజు, నాయకుడు అరివెల్లి ధానయ్య, కన్వీనర్లు మతుకుమిల్లి శ్రీధర్, ఆర్మీబాలు, కొడమంచిలి మూర్తిరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలకు ఏర్పాట్లు

దెందులూరు: గాలాయగూడెంలో అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి 66వ వార్షికోత్సవ వేడుకలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు 9 రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. చివరి రోజున మధ్యాహ్నం 2 గంటలకు వేలాది మంది భక్తుల సమక్షంలో అగ్నిగుండ ప్రవేశం, 10వ రోజు అమ్మవారి ఆలయ ఆవరణలో వేలాది మంది భక్తులకు మహా అన్నసమారాధన నిర్వహించనున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చిన్న వెల్లమిల్లిలో ప్రజలను చైతన్య పరుస్తున్న వైద్య సిబ్బంది

ఉంగుటూరు: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా యూనిట్ పర్యవేక్షకులు వై.వి.లక్ష్మణరావు తెలిపారు. చిన్నవెల్లమిల్లి, చింతాయిగూడెంలో పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఇళ్ల ముందు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాల్సిన ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధులపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు విజయకుమారి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశావర్కర్లు లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త ఇందిరా దేవి, వలంటీర్లు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



కోడిపందాలు ఆడే ప్రాంతాల్లో సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న తహసీల్దార్

ఉంగుటూరు: కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఉంగుటూరు, చేబ్రోలు గ్రామాల్లో కోడి పందేలు, జూదాలు వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ సంక్రాంతి వేళ సంప్రదాయ క్రీడలైన కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, మ్యూజికల్ చైర్స్, హాకీ వంటి క్రీడలతో ఆనందంగా గడపాలన్నారు. కోడి పందేలు, గుండాట, కోశాట, పేకాట తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జోలికి వెళ్లి కఠినమైన చట్టాల్లో ఇరుక్కుని జీవితాలను చేజేతులా నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సై సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే ఆళ్ల నాని





శాంతినగర్‌లో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని, మేయర్ నూర్జహాన్, ఇడా చైర్‌పర్సన్ ఈశ్వరి మాదేపల్లిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే ఉన్నతాశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరులో 71వ రోజు మంగళవారం 38వ సచివాలయం పరిధిలోని శాంతినగర్‌లో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ పాదయాత్రగా వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలు అర్హులకు అందుతున్నాయా లేదా అని నాని ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ అన్నపనేని భారతిదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నపునేని రవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రజల కష్టాలు, బాధలను ప్రజా సంకల్ప పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలుసుకున్నారని, ఆయన సీఎం పదవి చేపట్టగానే సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. పేదలకు గూడు కల్పించాలనే ఉన్నతాశయంతో అక్కాచెల్లెమ్మలకు సొంతింటి కలను నెరవేర్చటానికి స్థలం మంజూరు చేయటంతోపాటు ఇల్లు కట్టించే బాధ్యత తీసుకున్నారని వివరించారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉండేందుకు పాలనలో పారదర్శకత తీసుకొచ్చారని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, తుమరాడ స్రవంతి, పిల్లంగోళ్ల శ్రీదేవి, ఇనపనూరి కేదారేశ్వరి, చిలకపాటి డింపుల్, పాలిమేర దాసు, యర్రంశెట్టి సుమన్, కలవకొల్లు సాంబ, కత్తిరి రామ్మోహనరావు, గునిపూడి శ్రీనివాస్, సుంకర చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల వర్తింపు

ఏలూరు రూరల్: పార్టీ, వర్గ భేదాలు లేకుండా అర్హతున్న ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తోన్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఆయన ఏలూరు మండలం మాదేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పని చేసి అర్హులను గుర్తించి పథకాల లబ్ధి అందించాలన్నారు. ఆయన ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులను కలిసి వారికి అందుతున్న పథకాల లబ్ధిని వివరించారు. పలువురు గ్రామస్తులు స్థానిక సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. వీటి పరిష్కారానికి అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, సర్పంచ్ కొరపాటి ప్రభుదేవ్, పార్టీ నాయకులు పీవీరావు, తేరా ఆనంద్, మండల కొండలరావు, పల్లెం ప్రసాద్, నరహరశెట్టి రాధాకృష్ణ, బొల్లిముంత రామ్మోహనరావు, గుర్రం శివ తదితరులు పాల్గొన్నారు.



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



చిన్నారుల కూచిపూడి నృత్య విన్యాసాలు

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, విశేష పూజలు, విష్ణు సహస్రనామ పారాయణ చేసి స్వామి వారి నిత్య హోమాలు, నిత్య కల్యాణ మహోత్సవాలు నిర్వహించి, స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పద్మావతి అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో నిర్వహించిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, నగరానికి చెందిన వెంపరాల రామలక్ష్మి శాస్త్రి నిర్వహించిన భక్తి సంకీర్తనల విభావరి అలరించాయి. ఉంగుటూరుకు చెందిన పాల రామాంజనేయులు భాగవతార్ సీతా కల్యాణం అనే అంశంపై హరికథా కాలక్షేపం చేశారు. రాత్రి 8 గంటలకు శ్రీపాద శ్రీవల్లభ కూచిపూడి నాట్య నిలయం ఆధ్వర్యంలో నాట్యాచారిణి మేదరమెట్ల శిరీష శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి.

స్వామి వివేకానంద జీవితం ఆదర్శనీయం



విజేతకు బహుమతి అందిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శమని, ఆయన విద్యార్థుల్లో జాతీయ స్ఫూర్తిని, జాతీయ భావనను పెంపొందించిన వ్యక్తి అని ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అలోక్ కుమార్ రాయ్ పేర్కొన్నారు. స్థానిక సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాల కల్చరల్ సెల్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో స్వామివివేకానంద 160వ జయంతి సందర్భంగా కళాశాల ఆడిటోరియంలో మంగళవారం యువజనోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు జానపద నృత్యాలు, పాశ్చాత్య నృత్యాలు, ఫ్యాన్సీ డ్రెస్, పాటలు, వక్తృత్వం, డిబేట్, ఏకపాత్రాభినయం, పెయింటింగ్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఆయా పోటీలకు నగరానికి చెందిన నాట్యాచార్య గండికోట రాజేష్, సీఆర్‌ఆర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజ్యలక్ష్మిబీఈడీ కళాశాల అధ్యాపకురాలు వి.హిమబిందు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు కళాశాల కరస్పాండెంట్ కేఏస్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, పీజీ కళాశాల డైరెక్టర్ కేవీఆర్ఎస్ఎస్ కొండయ్యరావు, ఇంటర్మీడియట్ కోర్సుల ప్రిన్సిపాల్ ఎ.వీరభద్ర రావు, లెఫ్టినెంట్ నవీన్ కుమార్ తదితరులు బహుమతులు అందజేశారు.

సీఎస్ఆర్ అమలు కోరుతూ వినతి



జెడ్పీసీఈఓ వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్ సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్‌ఆర్) అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ దెందులూరు మండలం ముప్పవరం సర్పంచ్ డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ జిల్లా పరిషత్ సీఈఓ రవికుమార్‌కు మంగళవారం సాయంత్రం వినతి పత్రం అందజేశారు. ఈ వివరాలను స్థానిక నరసింహారావుపేటలోని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యాలయంలో వెల్లడించారు. కంపెనీ యాక్ట్ 2013 సెక్షన్ 135ను అమలు చేయని పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు. తమ పంచాయతీ పరిధిలో నాగహనుమాన్ సాల్వెంట్ ఆయిల్ మిల్స్, శ్రీసాయి ప్రాన్స్ అండ్ ఫిష్ ట్రేడింగ్, ఎస్ఎఫ్‌సీ ఆనంద్ ఐస్ ఫ్యాక్టరీ, యారస్ స్పెనింగ్ మిల్ ఉన్నాయని, వీటిలో నాగహనుమాన్ సాల్వెంట్ ఆయిల్ మిల్స్ ఫ్యాక్టరీ ఇప్పటి వరకు తమ ఫైనాన్స్ టర్నోవర్‌కు సంబంధించి పంచాయతీకి ఏవిధమైన సహాయ సహకారాలు అందించలేదని వివరించారు. కంపెనీస్ యాక్ట్ ప్రకారం రెండు శాతం కాంట్రిబ్యూషన్ ఖర్చు చేయాల్సి ఉందన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి సీఎస్ఆర్ అమలయ్యేటట్టు చూసి తమ గ్రామ అభివృద్ధికి తోడ్పడాల్సిందిగా సర్పంచ్ సంతోష్ కుమార్ కోరారు.

సంప్రదాయాలకు పునరుత్తేజం తేవాలి



రంగవల్లులను పరిశీలిస్తున్న కమిటీ, సీఐ

ఏలూరు టౌన్: పచ్చని పల్లెసీమలు మన సంస్కృతి సంప్రదాయాలకు నిలయాలని, వీటికి విలువ ఇస్తూ పునరుత్తేజం తేవాల్సిన అవసరం ఉందని ఏలూరు వన్‌టౌన్ సీఐ బోనం ఆదిప్రసాద్ అన్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాలతో ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు సూచనలతో సీఐ ఆదిప్రసాద్, ఎస్సై లక్ష్మణబాబు ఆధ్వర్యంలో గుడివాకలంక గ్రామంలో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత సంప్రదాయ క్రీడలైన ఖోఖో, బాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ వంటి క్రీడలపై ఆసక్తి చూపించాలన్నారు. సంక్రాంతి నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలకు వెళ్లకుండ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గుడివాకలంక సర్పంచ్ రామారావు, వైస్ ప్రెసిడెంట్ మహారాజ్, గ్రామ పెద్దలు, ప్రజలు, మహిళలు ఉన్నారు.

తిమ్మాపురంలో బరి ధ్వంసం

ద్వారకాతిరుమల: మండలంలోని తిమ్మాపురంలో కోడి పందేల నిర్వహణకు సిద్ధం చేసిన ఒక బరిని మంగళవారం ఎస్సై టి.సుధీర్, సిబ్బంది ధ్వంసం చేశారు. బరిని ట్రాక్టర్‌తో దున్నించి, చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు ఏర్పాటు చేసిన స్తంభాలను తొలగించారు. హెచ్చరిక ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. సంప్రదాయం పేరుతో కోడి పందేలు, జూదాలను నిర్వహిస్తే చూస్తూ ఊరుకోమని ఎస్సై హెచ్చరించారు. అనంతరం పంగిడిగూడెంలో సంక్రాంతి పండుగపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ మహాలక్ష్ముడు, తదితరులు పాల్గొన్నారు.

దేవునియందు విశ్వాసం కలిగి ఉండాలి



సభలో మాట్లాడుతున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు వేదికపై ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: దేవుని యెడల విశ్వాసం, నమ్మకం కలిగి ఉంటే దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడు ఉంటాయని శాసనమండల చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. మంగళవారం గణపవరం వైఎస్సార్ కాలనీలో క్రీస్తుఆరాధన ప్రార్థన గుడారము 13వ వారికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన సభకు ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అధ్యక్షత వహించారు. సభలో మోషేన్‌రాజు మాట్లాడుతూ దేవుని ఆత్మతోను, సత్యముతోను ఆరాధించి దేవుని యందు భయభక్తులు కలిగి ఉండాలని అప్పుడే దేవుని దీవెనలు అందుతాయని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు క్రీస్తుని ఆరాధిస్తున్నారని, వారంతా దేవుని సందేశాన్ని పాటిస్తూ సాటి మానవుల యెడల ప్రేమ, దయాగుణం కలిగి ఉండాలని సూచించారు. రాష్ట్రంలో క్రైస్తవుల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. ఎప్పుడూ లేనివిధంగా పాస్టర్లకు నెలకు రూ.5వేల గౌరవవేతనం అమలు చేస్తున్నామని అన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఇచ్చిన సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరిస్తే సమాజంలో శాంతి సౌభాగ్యాలు నెలకొంటాయన్నారు. ప్రజల రక్షణ కొరకు క్రీస్తు తన రక్తాన్ని చిందించారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రక్రీస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్, గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, సర్పంచ్ మూర అలంకారం, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దండు రాము, పుప్పాల చినబాబు, సొసైటీ అధ్యక్షుడు కొనికెట్టి రమేష్, చర్చిఫాదర్ ఎ.రమేష్, వ్యవసాయసలహా సంఘం జిల్లా చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు పార్టీ నాయకులు కాకర్ల శ్రీను, నడింపల్లి సోమరాజు, రొంగల శ్రీను, తోటశ్రీను, కొండేటి వెంకటరత్నం, తెనాలి సునీల్, దేవారపు బాబులు, శెట్టి రాజా తదితరులు పాల్గొన్నారు.

కృష్ణావతారంలో జనార్దన స్వామి



శ్రీ కృష్ణావతారంలో జనార్దన స్వామి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారం భూ, నీళా సమేత జనార్దన స్వామి దేవస్థానంలో స్వామి వారికి ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, నిత్యార్చన, తిరుప్పావై సేవా కాలం నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. రాత్రి స్వామివారికి శ్రీకృష్ణావతార అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు వంగల పవన్ కుమార్ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్ల రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

దాతల సహకారం అభినందనీయం



గుండుగొలను ఉన్నత పాఠశాల హెచ్‌ఎంకు ఫర్నిచర్ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

భీమడోలు: పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. అలాగే క్రమశిక్షణ, సేవాభావంను విద్యార్థి దశ నుంచి అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని తెలిపారు. గుండుగొలను మావులేటి సోమరాజు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1984-89లో చదువుకున్న 120 మంది పూర్వ విద్యార్థులు అందించిన లక్ష రూపాయల ఆర్థిక సాయంతో మంగళవారం పాఠశాలలో ఇనుప కుర్చీలు, రివాల్వింగ్ చైర్స్ తదితర ఫర్నిచర్‌ను పాఠశాల హెచ్‌ఎం గారపాటి కనకదుర్గా సునీతకు అందజేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు చూపే కృషి అభినందనీయమన్నారు. అనంతరం హెచ్‌ఎం సునీతా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవడం చాలా సంతోషమన్నారు. పాఠశాలకు ఫర్నిచర్‌ను అందించిన బ్యాచ్ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం హెచ్‌ఎం, ఉపాధ్యాయులను దుశ్శాలువాలను కప్పి ఘనంగా సత్కరించారు.

కమ్యూనిటీ హాలుకు నిధులివ్వాలని వినతి

దెందులూరు: ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ. 10 లక్షల నిధులు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని కోరారు. ఏలూరులో ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మించదలిచామని, ఈ నేపథ్యంలో తమ వంతు సహకారంగా రూ.10 లక్షలు మంజూరు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి పూర్తి సహాయసహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. వినతిపత్రం అందించిన వారిలో రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి చాగంటి సంజీవ్ కుమార్, ఫారెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ పళ్ళెం ప్రసాద్, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, కొవ్వలి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాటి సుధాకర్, మండల వైఎస్సార్‌సీపీ నేత నిట్టా గంగరాజు ఉన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	00

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	13
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	30
ఏలూరు -తిరుపతి	16.00	4830	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	00
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	00

చేపల చెరువుల తవ్వకాలకు అనుమతుల్లేవు



సర్వేలో మాట్లాడుతున్న మండల ఇన్‌చార్జి మత్స్యశాఖాధికారి కె.మంగారావు

భీమడోలు: కొత్తగా చేపల చెర్వులను తవ్వుకునేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం లేదని భీమడోలు మండల ఇన్‌చార్జి మత్స్యశాఖాధికారి కె.మంగారావు అన్నారు. మండలంలోని భీమడోలు, ఆగడాలలంకలో మంగళవారం ఆక్వా జోన్ రీసర్వేపై గ్రామ సభలు నిర్వహించారు. భీమడోలు పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంగారావు మాట్లాడుతూ నాన్ ఆక్వాజోన్ పరిధిలోని చేపల చెర్వుల సర్వే నంబర్లు, విస్తీర్ణం తెలుసుకుని వాటిని ఆక్వా జోన్‌లోకి తీసుకుని వచ్చేందుకు ప్రభుత్వం ఈ గ్రామ సభలను ఏర్పాటు చేసిందన్నారు. ఆక్వా జోన్‌లోకి వచ్చే చేపల చెర్వులకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. దీనితో ఆక్వా రైతులకు ఎంతగానో మేలు చేకూరుతుందన్నారు. మండలంలో భీమడోలు, గుండుగొలను, ఆగడాలలంక, కురెళ్లగూడెం, ఎంఎంపురం, సాయన్నపాలెం, చెట్టున్నపాడు, మల్లవరం, కోరుకల్లు రెవెన్యూ ఆయుకట్టుల్లో చేపల సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉందన్నారు. దీనితో ఆ ప్రాంతాలు ఆక్వాజోన్‌ల పరిధిలోకి వస్తున్నాయన్నారు. మరికొన్ని ప్రాంతాల్లో చేపల చెర్వులు ఉన్నప్పటికీ వాటిని ఆక్వాజోన్ పరిధిలోకి రాకపోకవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారని గుర్తించిన ప్రభుత్వం నాన్ ఆక్వా జోన్‌లోని సర్వే నంబర్లు, విస్తీర్ణాలను గుర్తించేందుకు ప్రత్యేకంగా సభలను నిర్వహిస్తోందన్నారు. దీనిపై నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. ప్రస్తుతంగా కొత్తగా చేపల చెర్వులను తవ్వుకునేందుకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. భీమడోలులో 2వేల విస్తీర్ణం ఉండగా సుమారు 1,200 ఎకరాల్లో ఆక్వా చేపల చెర్వులను విస్తరించాయన్నారు. రీ సర్వే తర్వాత కొత్తగా చెర్వులు తవ్వుకునేందుకు అనుమతుల మంజూరు విషయంలో ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ భలే రాంబాబు, చేనేత విభాగం వైసీపీ జిల్లా అధ్యక్షుడు గోలి సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు సైదు గోపాలకృష్ణ, కార్యనిర్వాహణాధికారులు ఎస్.ఠాగూర్, మురళీలు, మత్స్యశాఖ సహాయ సహాయకులు వాసు, ఎస్‌కే రఫీ, ఆక్వా రైతులు పాల్గొన్నారు.